‘టీ-హబ్’ ఏర్పాటుపై సందిగ్ధం

- ఇప్పటికీ భద్రాచలం రాని వైద్యబృందం
- నూతన భవన నిర్మాణంపై కొరవడిన స్పష్టత
- నిధుల మంజూరుపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం



భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలోని పాత ఆయుష్ భవనం

భద్రాచలంఅర్బన్: ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో ఉన్న ఏరియా ఆస్పత్రిలో టీ-హబ్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు గాను ఈ నెల 9వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ జీఓ జారీ చేసింది. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాలుగు ఐటీడీఏల (భద్రాచలం, ఉట్నూర్, ఏటూరునాగారం, మన్ననూర్) పరిధిలో నూతనంగా టీ-హబ్ డయాగ్నోస్టిక్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఏటూరునాగారం, ఉట్నూర్ లో ఇప్పటికే భవనాలు నిర్మించి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్ర వైద్య బృందం ఈ కేంద్రాలను సందర్శించాయి. కానీ భద్రాచలంలో ఆ పరిస్థితి లేదు.

రెండు సార్లు పర్యటన రద్దు..

ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లోనే ఈ నెల 17 న రాష్ట్ర వైద్య బృందం భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సందర్శించి, ఇక్కడ కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన పరికరాలు తదితర అంశాలను పరిశీలించాల్సి ఉండగా.. పర్యటన రద్దు అయినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇదే వైద్య బృందం తిరిగి ఇదే నెల 22వ తేదీ లేదా 23న వస్తారని అధికారులు చెప్పినప్పటికీ.. నేటికీ వైద్యబృందం రాలేదు. అసలు ఆ అధికార బృదం వస్తారా.. రారా.. వస్తే ఎప్పుడొస్తారనే సందిగ్ధం నెలకొంది.

భవన నిర్మాణానికి నిధుల లేమి..

టీ-హబ్ కేంద్రం ఏర్పాటుకు విశాలంగా ఉండే భవనం కావాల్సి ఉంది. ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఉన్న భవనాలు అన్ని ఉపయోగంలోనే ఉన్నాయి. అయితే భద్రాచలంలో గత ప్రభుత్వ హయాంలో టీ-హబ్ కేంద్రానికి గత ప్రభుత్వ హయాం రూ.90 లక్షల నిధులు కేటాయించింది. అయితే వాటితో భవనాలు నిర్మించి, పరికరాలు కొనుగోలు చేయడం సాధ్యపడదు. ఆ నిధులు కేవలం పరికరాలకే సరిపోతాయి. ఇలాంటప్పుడు ఆ నిధులు ఎలా వినియోగించాలా అనే స్థానిక అధికార యంత్రాంగం ఆలోచించసాగింది. అందుకు అధిక సమయం తీసుకోవడంతో నిరూపయోగంగా ఉన్న ఆ నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. కాని ఏటూరునాగారం, ఉట్నూర్ ప్రాంతాలల్లో అధికారులు సదరు నిధులతో ముందస్తుగా భవనాలు నిర్మించారు. ఈ నేపథ్యంలో భద్రాచలం అధికారులు ఏమీ చేయలేక ముందుగా ఈ రెండు కేంద్రాలకు పరికరాలు సమకూర్చే పనిలో పడ్డారు. ఏరియా ఆస్పత్రిలో టీ-హబ్ కేంద్రం ఏర్పాటుకు పాత క్యాంటీన్, ప్రస్తుతం రక్త పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రం ఉపయోగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతోపాటు టీ-హబ్ నూతన భవనం నిర్మాణం చేసేందుకు పాతబడిన ఆయుష్ భవనం, పాత మార్చురి ప్రదేశం, పాత క్లస్టర్ ఆఫీస్ ప్రాంతాలను పరిశీలించవచ్చు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేయాల్సిన టీ-హబ్ కేంద్రానికి 6 ల్యాబ్ టెక్నీషన్లు, 1 డేటా ఎంట్రీ ఆపరేటర్, 2 ల్యాబ్ అటెండెంట్స్ కావాలి. ఈ సిబ్బంది కోసం అధికారులను కొత్త వ్యక్తులను రిక్రూట్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న రక్త పరీక్ష కేంద్రంలో మొత్తం 10 మంది విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ కేవలం ముగ్గురు వ్యక్తులు మాత్రమే అదనపు బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో టీహబ్ కోసం కొత్తవారినికి ఖచ్చితంగా రిక్రూట్ చేసుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా స్థానిక వైద్య అధికారులు టీ-హబ్‌కు భవనం, వైద్య సిబ్బందిని సమకూర్చుకోవాల్సి ఉంది. వైద్యబృందం త్వరగా సందర్శించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉంది. తద్వారా వీలైనంత త్వరలో స్థానిక ఏజెన్సీ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులోకి వస్తాయి.

ముందస్తుగా పరికరాలు ఏర్పాటు..



ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న టీ-హబ్ డయాగ్నోస్టిక్ కేంద్రంలో భాగంగా ముందస్తుగా పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆపై రాష్ట్ర వైద్య బృందం పర్యటించి తదనంతరం భవనం ఏర్పాటు, చేయాల్సిన మార్పులు, తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై స్పష్టత వస్తుంది. ఏజెన్సీ ప్రజలకు సౌకర్యార్థంగా ఉండాలనే భద్రాచలంలో టీ-హబ్ డయాగ్నోస్టిక్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

క్లుప్తంగా

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

భద్రాచలంఅర్బన్: జాతీయ స్థాయి రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం వాహనచోదకులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు రోడ్డు మీద వ్రాంగ్ రూట్‌లో వెళ్లొద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం ఇతర ట్రాఫిక్ నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్సైలు వెంకన్న, శ్రీనివాస్, ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి స్థలం అందజేత

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం భవనం నిర్మాణానికి గ్రామానికి చెందిన తెల్లాకుల రాములు, భారతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు తెల్లాకుల కృష్ణ, అనిత దంపతులు రెండు కుంటల భూమిని దానంగా ఇచ్చారు. సోమవారం ఆ భూమిలో పంచాయతీ కార్యాలయం భవనం నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చాప ఉమాదేవి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్ పోటీలు

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, ఎస్సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం మండల స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలను నిర్వహించారు. పోటీల ప్రశ్నాపత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.నాగశ్రీ విడుదల చేశారు. పోటీలో జె.షణ్ముఖశ్రీసాయి, డ్రామాలో సాత్విక, సాయికుమార్, గాయత్రీలు విజేతలుగా నిలవడంతో పాటు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయులు షేక్ మీరాహుస్సేన్, మేరెడ్డి ఇంద్రసేనారెడ్డి, సాంబయ్య, పార్వతి, రాజా, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిల విడుదలకు వినతి

అశ్వాపురం: గ్రామ పంచాయతీలలో రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర పనులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలకు నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సర్పంచ్‌లు కోరారు. మండలంలోని సర్పంచ్‌లు సోమవారం మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో వెంటనే బకాయిలు చెల్లించి సర్పంచ్‌లను ఆదుకోవాలని విన్నవించారు. సర్పంచ్‌లు బాణోత్ శారద, పాయం భద్రమ్మ, బట్టా సత్యనారాయణ, కాకా అశోక్, బండ్ల సీతమ్మ పాల్గొన్నారు.

పటిష్టంగా అమలు చేయాలి

మణుగూరురూరల్: మహిళా రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయాలని సీపీఐ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన మహిళా సమైక్య మండల కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారిత ఏర్పడుతుందన్నారు. సమావేశంలో మహిళా సమైక్య మండల అధ్యక్ష, కార్యదర్శులు బొలగాని సమ్మక్క, నాగెళ్ల నిర్మల, నాయకురాళ్లు పాయం లక్ష్మి, అజ్మీర బద్రి, ప్రమీల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో అండ్ వీడియోస్ అసోసియేషన్ ఎన్నిక

మణుగూరురూరల్: మణుగూరు మండల ఫొటో అండ్ వీడియోస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. 31ఓట్ల మెజార్టీతో కృష్ణమోహన్ గెలుపొంది అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా పునులూరి శ్రీనివాస్, కోశాధికారిగా ఎంఆర్ ఎస్.శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ వారికి జిల్లా కమిటీ వారు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు వేముల నర్సింహారావు, గుణగంటి సారయ్య, జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి రామకృష్ణ, జిల్లా ఎన్నికల అధికారి పంపన రమేష్, మండల ఎన్నికల అధికారులు కరుణాకర్, సిరియాల సురేష్ పాల్గొన్నారు.

నర్సింహారావుకు సన్మానం

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన లంకా నర్సింహారావును మున్నూరుకాపుసంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపుసంఘం అనుబంధ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆయన ఇటీవల నియమితులయ్యారు. సంఘం నాయకులు రామిశెట్టి సైదయ్య, వెలగల మధు, జ్యోతి దర్గయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: కుష్ఠు వ్యాధిపై మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నేటి నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను ఆయన వివరించారు. కుష్ఠు రహిత సమాజ నిర్మాణ కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఫిబ్రవరి 12వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు, ఒకటి నుంచి 19సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీఓ జయలక్ష్మి, వైద్య, సీడీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కురుమల వినతి


జారేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములకలపల్లి: గొల్ల, కురుమలకు సబ్సిడీపై గొర్రెలు మంజూరు చేయాలని కోరుతూ మండలపరిధిలోని రామచంద్రాపురం కురుమల సంఘం ఆధ్వరంలో స్థానిక సర్పంచ్ సున్నం సుధాకర్ సారథ్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. సోమవారం గండుగులపల్లిలోని స్వగృహంలో ఎమ్మెల్యే జారెను కలిసి సమస్యను విన్నవించారు. గొర్రెల కొనుగోలు నిమిత్తం బ్యాంకులో డీడీ తీసి ఏళ్లు గడుస్తున్నా, నేటికి పట్టించుకునేవారే లేరని వాపోయారు. న్యాయం చేయాలని అభ్యర్థించారు. మాజీ ఎంపీటీసీ జుబ్బూరి అక్కులు, అచ్చెన వెంకటేశ్వర్లు, అచ్చెన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


53 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల 1969–71 మధ్య ఇంటర్ మొదటి బ్యాచ్ విద్యార్థులు 53 ఏళ్ల తరువాత సోమవారం భద్రాచలంలోని చినజీయర్ మఠంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఒకరినొకరు ఆలింగనాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. చిన్న నాటి సంఘటనలు అప్పటి ఆట పాటలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. విద్యను అభ్యసించిన జూనియర్ కళాశాలను సందర్శించి వారు చదివిన గదులలో కూర్చోని పాత స్మృతులతో ఆనందాన్ని పంచుకున్నారు. డాక్టర్ గోళ్ల భూపతిరావు, యార్లగడ్డ హనుమంతరావు, మల్లాది వెంకటరావు, కృష్ణబాబు, వెంకటనర్సయ్య, నాగభూషణం, సత్యనారాయణ రెడ్డి, అంజనేయ వర్మ, అప్పారావు, రమణరెడ్డి, కృష్ణ కుమార్, సుబ్బారావు, శంకర్‌రావు, శ్రీధర్, వర్మ, అప్పారావు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌కు సన్మానం


ప్రిన్సిపాల్ దంపతులను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపాల్ దేవదాసు ఉత్తమ ప్రిన్సిపాల్‌గా రిపబ్లిక్ డే రోజు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఘజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన సభలో వక్తలు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ పాఠశాల, కళాశాల బాలికలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బసవ కుమారి, సరస్వతి, జ్యోష్ణ, వసంతకుమారి, శారద, అరుణకుమారి, జగన్మోహిని, రాంబాబు, వీరభద్రం, బాలయోగి, సరోజిని, ఝాన్సీ, సుజాత, దుర్గ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శికి..

ములకలపల్లి: ఉత్తమ కార్యదర్శిగా ఎంపికై, గణతంత్ర్య దినోత్సవాన జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం పొందిన జగన్నాథపురం జీపీ కార్యదర్శి ఇబ్రహీంను స్థానికులు ఘనంగా సత్కరించారు. సోమవారం జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అడపా నాగేశ్వరరావు, సురభి రాజేశ్ పుష్పగుచ్ఛం అందించి. దుశ్శాలువతో సత్కరించారు. షేక్ షఫీ, కాగితాల రంగారావు, పిడియాల వెంకటేశ్వర్లు, మహమ్మద్ షబ్బీర్, అడపా సంపత్, పలగాని మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన వైద్య విద్యార్థి దాడి భార్గవికి వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. హైదరాబాద్ పటాన్ చెరువు అయినోలులోని తమన్నగారి రామ్మోహన్ రెడ్డి (టీఆర్ఆర్) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్స్ కళాశాలలో భార్గవి వైద్య విద్యను ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తుంది. వైద్య విద్య చదివేందుకు ఆర్థిక సహకారం అందించాలని వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజును సంప్రదించగా.. ఆయన ఫౌండేషన్ అధ్యక్షుడు మంతెన వెంకటరామరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధ్యక్షుడు మంతెన వెంకటరామ రాజు రూ.20 వేల చెక్కును ఏఎస్పీ పరితోష్ పంకజ్ చేతుల మీదుగా అందజేశారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

అన్నపురెడ్డిపల్లి: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేసిన వారు సైతం నూతనంగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ చదివి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

అశ్వారావుపేటరూరల్: హమాలీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. సోమవారం అశ్వారావుపేటలోని హమాలీ అడ్డా వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న హమాలీ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకునే వారేలేరని, కార్మిక చట్టాలు సైతం వీరికి వర్తించడం లేదని వాపోయారు. పెరుగుతున్న ధరలు తగ్గించాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను హమాలీ కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రాంబాబు, ఏసు, రమేష్, మారేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

ఉత్తమ కరస్పాండెంట్‌గా బీఎన్ఆర్

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు (బీఎన్ఆర్) రాష్ట్ర స్థాయి ఉత్తమ కరస్పాండెంట్‌గా ఎంపికయ్యారు. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవార్డుల్లో బీఎన్ఆర్ ప్రైవేటు పాఠశాలల విభాగంలో ఉత్తమ కరస్పాండెంట్‌గా ఎంపికయ్యారు. ఆదివారం ఆయనకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం భద్రాచలంలో మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోండి


మినీఅంగన్‌వాడీల అప్‌గ్రేడ్ ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలో ఉన్న బాలింతలు, గర్భిణులకు, శిశువులందరికి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ప్రజాభవన్(క్యాంప్ కార్యాలయం)లో ఆయన సీడీపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీల పని తీరుపై సమీక్షించి.. కేంద్రాల్లో వసతి సౌకర్యాలు, అద్దె భవనాలు, సొంత భవనాలు వివరాలను, ప్రభుత్వం నుంచి నెల నెలా అందుతున్న గ్రుడ్లు, నూనె, పాలు, తదితర వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల వివరాల నివేదికలను అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. అప్‌గ్రేడ్ వల్ల 164 కేంద్రాలను ప్రయోజనం చేకూరనుందన్నారు. అనంతరం అప్‌గ్రేడ్‌కు సంబంధించిన ధృవపత్రాలను ఆయా కేంద్రాల టీచర్లకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పాయంను సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు పూలబొకేలు అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా అధికారి విజేత, సీడీపీఓలు జయలక్ష్మి, తార, సీతారామ, ఏసీడీపీఓ సలోని, రేవతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

మణుగూరురూరల్: సింగరేణి ఓటీ కంపెనీలలో స్థానిక నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ మండల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి బొగ్గు గనుల విస్తరణ కోసం గ్రామాల్లోని పేదలు భూములు, ఆస్తులు, ఇళ్లను, త్యాగం చేసి సంస్థకు, సంస్థ అభివృద్ధికి సహకారం అందించారని తెలిపారు. కానీ నిర్వాసిత, ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సింగరేణి సంస్థ వైఫల్యం చెందిందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణ, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సుధాకర్, జంగం మోహన్‌రావు, మంగి వీరయ్య, రాజు, సంపత్, ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఏఐటీయూసీ మండల నూతన కమిటీని మండల జనరల్ బాడి సమావేశం అనంతరం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాయల బిక్షం, కార్యదర్శిగా జి.వెంకటేశ్వర్లు(జీవి), గౌరవ అధ్యక్షులుగా తోట రమేష్, జక్కుల రాజ బాబు, ఉపాధ్యక్షులుగా ఆదర్ల రాములు, సహాయ కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా కొత్తపల్లి సీతారాములతో పాటు 13మంది కార్యవర్గ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

క్యాలెండర్లు, డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్: బీటీపీఎస్ ఆవరణలో 1104 యూనియన్ క్యాలెండర్, డైరీలను సీఈ బి.బిచ్చన్న చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిచ్చన్న మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు నాణ్యమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రాష్ట్రానికి అందించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం బిచ్చన్నను యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కంటే రాజేందర్, కేశబోయిన కోటేశ్వరరావులు శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హేమ్లా నాయక్, సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు లచ్చిరాం, రీజనల్ నాయకులు వెంకట్ రాం, సాంబశివరావు, రమేష్, శ్రీనివాసరావు, ఏపూరి నాగేశ్వరరావు, వెంకన్న, సంగయ్య, మహిళా నాయకురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

దమ్మపేట: మండల స్థాయి ఇంగ్లీష్ స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారిని కీసర లక్ష్మి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. సోమవారం దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండల స్థాయి ఇంగ్లీష్ స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు మనోహరిసాయి, ప్రణీత, దీలిప్‌కుమార్‌లకు బహుమతులను ఎంఈఓ, హెచ్‌ఎం ఉషారాణిలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌వలీ, శివాజీ, జగన్మోహన్ రెడ్డి, రామారావు, రాఘవరావు, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా..

చండ్రుగొండ: కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలపై పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రావికంపాడు గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. నిత్యం ప్రజాక్షేత్రం ఉంటు ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, మెడా మోహన్ రావు, భూపతి రమేష్, సూరా వెంకటేశ్వర్లు, ఉన్నం నాగరాజు, సత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పునరావాస గ్రామంగా ప్రకటించాలి

మణుగూరురూరల్: సింగరేణి మణుగూరు ఓసీ వల్ల కాలుష్యం బారిన పడుతున్న రాజుపేటను సింగరేణి పునరావాస గ్రామంగా ప్రకటించాలని తెలంగాణ భూనిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ.. మణుగూరు ఓసీ గని వల్ల కాలుష్యం ఏర్పడి ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు గ్రామాన్ని ప్రభావిత పునరావాస గ్రామంగా ప్రకటించి ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. సదస్సులో నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, సత్రపల్లి సాంబశివరావు, పిట్టల నాగమణి, బొల్లం రాజు, నర్సింహారావు, నిర్వాసితులు ప్రభాకర్, మున్నా, సతీష్, కవిత, వెంకట్రాములు, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు చేయూతనందించాలి

బూర్గంపాడు: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వపరంగా చేయూతనందించాలని ఎమ్మెల్సీ కోదండరామ్‌ను ఉద్యమకారుల సంఘం నాయకులు కోరారు. సోమవారం కొత్తగా ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసేలా కృషి చేయాలని వారు ఆయనను కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన 250 గజాల ఇంటిస్థలాన్ని ఉద్యమకారులకు వెంటనే కేటాయించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడాలని వారు ఆయనను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు తిప్పన సిద్ధులు,మర్రి సాంబారెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌ది నిర్బంధాల పాలన’

భద్రాచలంటౌన్: ప్రజా పరిపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అప్రకటిత నిర్బంధాలను చేస్తోందని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి ఎమ్.వెంకట్ రెడ్డి ఆరోపించారు. భద్రాచలం పట్టణంలో సోమవారం జరిగే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ కౌన్సిల్‌ను పోలీసులు అనుమతిని నిరాకరిస్తూ సభను అడ్డుకోవడాన్ని ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఖండించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వాలు కూడా విద్యార్థి సంఘాలను అనిచివేలని చూసి ఇంటిదారి పట్టాయని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంజుల, జిల్లా అధ్యక్షుడు సాంబ, గణేష్, ప్రణయ్, ప్రియాంక, అజీమ్, సింధు, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


అన్నపురెడ్డిపల్లి: ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అన్నపురెడ్డిపల్లి: కొత్తగూడెంలో ఆదివారం జరిగిన కరాటే పోటీలలో స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఓపెన్ ఓవరాల్ కరాటే ఛాంపియన్ పోటీల్లో 23 బంగారు పథకాలు, 3 రజిత, 4 కాంస్య పథకాలు సాధించారని విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ కవిత తెలిపారు. విద్యాలయ విద్యార్థులు ఎక్కువ పథకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కప్ గెలుచుకున్నట్లు వెల్లడించారు. పథకాలు సాధించిన విద్యార్థులను, కరాటేలో శిక్షణ ఇచ్చిన పవన్‌రెడ్డిని అభినందించారు.

భద్రాచలంటౌన్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఓపెన్ కరాటే పోటీలలో భద్రాద్రికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. పట్టణంలోని రూపా స్కూల్ విద్యార్థులు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే పోటీలలో భార్గవరామ్, నాగిని వర్ధన్ ఉత్తమ ప్రతిభ కనభరిచి 2024 ఛాంపిన్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులను సోమవారం అభినందించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, క్రీడాకారులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.